సంతోషంగా దసరా జరుపుకోవాలి

అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు

అత్తాపూర్: దసరా పండుగను ప్రజలు కుటుంబ సమేతంగా సంతోషంతో నిర్వహించుకోవాలని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణలో బతుకమ్మ, దసరా పండుగలను కులమతాలకు అతీతంగా జరుపుకుంటారని అన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకోవాలని కోరారు.





కార్మికులకు దుస్తుల పంపిణీ


మున్సిపల్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న గోకరి లతాసురేష్‌గౌడ్

బండ్లగూడ: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో గొప్పవని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గోకరి లతాసురేష్ గౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ సిబ్బందికి దుస్తులు, నగదు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా మున్సిపల్ సిబ్బందికి బట్టలు, డబ్బులు అందజేశామన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తేవాలని వాటిని పరిష్కరించేందుకు ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కేసులకు భయపడం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

- సంబంధం లేని వారిపై కేసులు
- సమస్యలపై ప్రశ్నిస్తునే ఉంటాం
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ఆలోచించుకోవాలి
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి

మణికొండ: సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధించటం మానుకోవాలని... కేసులకు భయపడే ప్రసక్తేలేదని వాటిని ఎదుర్కొంటామని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మణికొండ వెంకటేశ్వరకాలనీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నెల క్రితం వెంకటేశ్వరకాలనీలో జరిగిన గొడవలో బీఆర్ఎస్ నాయకుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి, షేక్ ఆరీఫ్‌లకు సంబంధం లేకపోయినా కేసులో ఇరికించారని ఆయన అన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్నపుడు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గెలుపునకు వారు కృషి చేశారన్నారు.

☛ ఇదే పద్ధతిలో శంషాబాద్‌లోనూ ఓ బీసీ నాయకుడిపై ఏకంగా రౌడీషీట్ ఓపెన్ చేశారని తెలిపారు. ఇలాంటి కక్ష రాజకీయాలు మానుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే తన వంతుగా కృషి చేయాలని హితువు పలికారు. బీఆర్ఎస్ నాయకులపై రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. మణికొండలో ఉన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, మెట్రో రైలు సాధనకు ఎమ్మెల్యే పోరాటం చేయాలన్నారు.

సంబంధం లేని వ్యక్తులతో గొడవ..

వెంకటేశ్వరకాలనీలోని సమస్యలు, పార్కుల అన్యాక్రాంతంపై తామంతా నిత్యం ప్రశ్నిస్తున్నామని బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ అధికార ప్రతినిధి బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. అవి నచ్చని వారు తమపై కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. తమ కాలనీ సమావేశం రోజు సంబంధం లేని పిలవని వ్యక్తులు వచ్చి గొడవ చేశారని తెలిపారు. తమ సొంత నిధులతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

☛ కాలనీలో ఉంటున్న కొందరు మరో సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకున్నపుడు తమ సమావేశాలకు ఎందుకు వచ్చారని ఆయన ప్రశ్నించారు. తమ కాలనీ సమస్యలపై మరింత ఉత్సాహంతో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు డి. సీతారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్‌లో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాల్మాకులలో రైతులకు యూరియా పంపిణీ



శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకులలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. సొసైటీ పరిధిలోని రైతులకు ఈ సీజన్‌లో మొదటిసారి యూరియా రావడంతో రైతులు బారులు తీరారు. క్యూలైన్ ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేపట్టారు. 225 బస్తాల యూరియా రావడంతో.. ఒక్క రోజే రైతులకు పంపిణీ చేశారు. మరో 225 బస్తాల యూరియా రెండు రోజుల్లో వస్తుందని అధికారులు తెలిపారు. కొన్ని రోజులుగా రైతులు యూరియా కోసం సొసైటీ వద్ద ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే.

నేడు రావణ దహన కార్యక్రమాలు

రాజేంద్రనగర్: దసరా పండుగ నేపథ్యంలో రావణ దహన కార్యక్రమానికి రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా భారీ రావణ బొమ్మలు ఏర్పాటు చేసి దహన కార్యక్రమాన్ని చేపడుతారు. అనంతరం అలయ్ బలయ్ కార్యక్రమాల కోసం భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. శివరాంపల్లి, రాజేంద్రనగర్, గ్రీన్ సిటీ, బుద్వేల్, ఎర్రబోడ తదితర ప్రాంతాల్లో ఇందు కోసం తగిన ఏర్పాట్లు చేపడుతున్నారు.























షాద్‌నగర్ వైపునకు వాహనాల అనుమతి

శంషాబాద్: తొండుపల్లి ఫ్లై ఓవర్‌పై నేషనల్ హైవే అథారిటీ చేపట్టిన సామర్థ్య పరీక్షలు పూర్తి కావడంతో బుధవారం సాయంత్రం నుంచి షాద్‌నగర్ వైపు వాహనాల ప్రయాణాలకు అనుమతినిచ్చారు. మంగళవారం ఉదయం నుంచి వాహనాలు సర్వీసు రహదారి గుండా వెళ్లాయి. ప్రస్తుతం ఇరు వైపుల యథాతథంగా రాకపోకలు సాగనున్నాయి.


బండ్లగూడ జాగీరులోని గంధంగూడలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో భక్తులు, చిన్నారులు

జై మాతా ది

- భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రుల చివరి రోజు పూజలు
- మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చిన అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కనులపండువగా జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులుపెద్దసంఖ్యలో ఆలయాలకు చేరుకున్నారు. నవమి సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలు, చండీహోమం, సహస్రనామార్చనలు నిర్వహించారు. పూజలతో ఆలయాల పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. దేవీ శరన్నవరాత్రుల చివరి రోజు కావడంతో ఆలయాలు, మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. బుధవారం (నవమి) అమ్మవార్లను మహిషాసురమర్దినిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గురువారం దసరా వేడుకలను పురస్కరించుకొని ఆలయాల్లో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం సాయంత్రం కార్యాలయాలు, దుకాణాలు ఆయుధ పూజకు ముస్తాబవుతూ కనిపించాయి.

– రాజేంద్రనగర్ జోన్ బృందం


నాగలింగేశ్వరాలయంలో పల్లకీ సేవ






బుద్వేల్‌లోని దేవాలయంలో..




పంచవటికాలనీలో హోమపూజ


మణికొండ పంచవటికాలనీ అమ్మవారి పూజలో బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి